క్లుప్తంగా

వీఆర్వోకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీలో వీఆర్వోగా పని చేస్తున్న చినపరెడ్డికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించినట్లు తహసీల్దార్ విద్యాసాగర్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన వీఆర్వోకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే పని చేసేలా ఉత్తర్వులు అందాయన్నారు. ఆర్‌ఐ అనీషా, మండల సర్వేయర్ రఫీక్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు శ్రీరాములుతో పాటు తోటి వీఆర్వోలు చినపరెడ్డిని అభినందించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

కురబలకోట : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు సూచించారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు సేఫ్టీపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేగం కన్నా ప్రాణం మిన్న, నిదానమే ప్రదానం లాంటి వాక్యాలు రోడ్డు పక్కన చూస్తుంటామన్నారు. అయితే చాలా మంది ఆచరించడం లేదన్నారు. రోడ్లు ప్రగతి మార్గాలుగా ఉండాలేకాని ప్రమాదాలకు నిలయం కారాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే క్షేమంగా గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఉదయ సాయంకాల వేళల్లో రద్దీ రోడ్లపై వాకింగ్, జాగింగ్, రన్నింగ్ లాంటివి చేయడం సరికాదన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం మరువలేనిది

కలకడ : మానవత స్వచ్ఛందసేవ సంస్థ ఉచిత సేవలను గుర్తించి సంస్థ మనుగడ, అభివృద్ధికి దాతలు అందిస్తున్న ఆదరణ, దాతల దాతృత్వం మరువలేనిదని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి గంగాద్రినాయుడు అన్నారు. శుక్రవారం కలకడ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, లక్ష్మన్నల ఆధ్వర్యంలో విరాళాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యలయం సిబ్బంది-20 మంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది -10 మంది సభ్యులుగా చేరారు. బాలయ్యగారిపల్లె పంచాయతీ పెవడ్లిమర్రివాండ్లపల్లె కు చెందిన ఉపాధ్యాయులు రేవూరి క్రిష్ణయ్య రూ.10,116, శ్రీవెంకటేశ్వరరైస్‌మిల్ యజమాని వెంకట్రమణ రూ.5,116 వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వైవి రమణ, యంఎస్ ఖాజాఫీర్, సయ్యద్‌సాహెబ్, పివి రమణ, వెంకటేశ్వర, విఆర్‌ఏ రమణ , నాగబసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు జన చైతన్య దీపికలు
– డాక్టర్ సుదాబత్తుల విజయకుమార్

కురబలకోట: పత్రికలు జన చైతన్య దీపికలని వాటి ద్వారా అపారమైన జ్ఞానాన్ని సముపార్జించవచ్చని సుదాబత్తుల గ్రూప్, సుధామ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సుదాబత్తుల విజయకుమార్ పేర్కొన్నారు. కురబలకోట మండలం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసీఏ, ఎంబీఏ విభాగం రోల్ ఆఫ్ నాలెడ్జి మేనేజ్మెంట్ సక్సెస్ పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పత్రికలు చదివితే సమాజాన్ని చదివినట్లేనన్నారు. స్థానిక, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కాలమాన పరిస్థితులు ఇతర సమాచారం తెలిసి రాగలదన్నారు. జరుగుతున్న పరిణామాలు, విషయాలను గ్రహించవచ్చన్నారు. కళాశాల పార్క్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఎంబీ ఏ విభాగాధిపతి గీతాదేవి, ఎంసీఏ విభాగాధిపతి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ

వాల్మీకిపురం: ప్రఖ్యాతిగాంచిన అజ్మీర్ దర్గాకు వాల్మీకిపురం హసన్‌ఖాన్‌వీధిలోని సయ్యద్‌ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా కమిటీ సభ్యులు చాదర్ సమర్పించారు. ప్రతి ఏటా వాల్మీకిపురం నుంచి అజ్మీర్ యాత్రకు ఆనవాయితీగా వెళ్తున్నట్లు కమిటీ అధ్యక్షులు సంధాని తెలిపారు. శుక్రవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం యాత్రికులకు చాదర్ అందించారు. కార్యక్రమంలో సైపుల్ల హజరత్, రామతుల్లా హజరత్, తాహీర్, జబ్బార్, మౌల, జమాల్ బాషా, జిలాని, ఆదిల్ బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దేశాన్ని గౌరవించాలి

బి.కొత్తకోట : ప్రతిఒక్కరూ దేశాన్ని ప్రేమించాలి–దేశం కోసం పాటుపడాలని నగర పంచాయతీ కమీషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో నా మట్టి–నా దేశం అమృత కలశ యాత్ర ప్రదర్శన నిర్వహించారు. పట్టణ ప్రధాన మార్గాల్లో ఈ ప్రదర్శన నిర్వహిస్తూ దేశభక్తి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతిఒక్కరూ నామట్టి–నాదేశం అని నినదించాలన్నారు. ఐక్యతకు భారత్ పుట్టినిల్లని, అందరూ దేశభక్తిని పుణికిపుచ్చుకున్న వారేనని అన్నారు. ర్యాలీలో నెహ్రూ యువక కేంద్రం, కరాటేక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ : శబరిమలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఛిటీడీఎం కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆదాయం పెంచాలన్నారు. కెఎంపిఎల్, ఈపీకెపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రీజియన్ పరిధిలో డిపో ఆదాయంలో మొదటిస్థానంలో ఉందన్నారు.

చదువుల తల్లీ..నమోస్తుతే..


గుర్రంకొండ: చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


మదనపల్లె సిటీ: కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళల కోలాటం


మదనపల్లె సిటీ:సరస్వతిదేవిగా వాసవీ అమ్మవారు


నిమ్మనపల్లె : సరస్వతీ అలంకరణలో మాతమ్మతల్లి


కేవీపల్లె : కాత్యాయనీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి


వాల్మీకిపురం: మహాలక్ష్మీదేవిగా నల్లవీరగంగాభవాని


వాల్మీకిపురం: చింతపర్తిలో కన్యకాపరమేశ్వరి


వాల్మీకిపురం: సరస్వతిదేవిగా వాసవీ అమ్మవారు


కలికిరి: సరస్వతిదేవి అలంకారంలో పార్వతీదేవి


పీలేరు : సరస్వతిదేవి అలంకరణలో అంకాలమ్మ


తంబళ్లపల్లె: ప్రత్యేక అలంకరణలో గౌరీమాత


ములకలచెరువు: సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు


రామసముద్రం: సరస్వతిదేవి అలంకారంలో శ్రీచౌడేశ్వరి

మదనపల్లె సిటీ : దేవి శరన్నరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మదనపల్లె పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను చదువుల తల్లి సరస్వతీదేవిగా అలంకరించారు. చేతితో వీణ చేతపట్టుకుని సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవి అలంకారం చేశారు. అప్పారావువీధి, అప్పారావుతోట, దేవళంవీధి ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపు తెచ్చి సమర్పించారు. వాసవీ మహిళా సంఘం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. తొగటవీరక్షత్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు గాజులు, పసుపు,పసుపుతాడులను అందజేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితత్రిపురసుందరిదేవి అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు.

సరస్వతీ అలంకరణలో మాతమ్మ తల్లి

నిమ్మనపల్లె : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెలోని మాతమ్మతల్లి సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిదిరోజుల పాటు ప్రత్యేక అలంకరణలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని విశేషవిద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక పూలతో అలంకరించారు.

కాత్యాయనీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి

కేవీపల్లె : మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిదేవిగా నల్లవీరగంగాభవాని

వాల్మీకిపురం : స్థానిక గంగమ్మ గుడివీధిలోని శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారు మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు సరస్వతిదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సరస్వతిదేవిగా, చింతపర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులను కటాక్షించారు.

సర్వస్వతీదేవి అలంకారంలో ఎల్లమ్మ

కలికిరి : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష అంకరణ చేశారు. అమ్మవారికి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. పట్టణంలో వెలసిన పార్వతీసమేత సోమేశ్వరాలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

సరస్వతి అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్థానిక నెహ్రూబజార్‌లో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పర మేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

సరస్వతీదేవిగా శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : దశరా మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కలకడ, గుడిబండ, కోన, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె పంచాయతీలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు ధర్శనమిచ్చారు. ఆలయాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీసభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సరస్వతీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవత పోలేరమ్మతల్లి దుర్గాదేవి అలంకారంలో, మరో గ్రామదేవత గంగమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సరస్వతీదేవీగా గౌరమ్మ

తంబళ్లపల్లె: దసరా వేడుకలలో భాగంగా శుక్రవారం గౌరీదేవి చదువుల తల్లి సరస్వతీమాత అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. మల్లయ్యకొండపై గౌరీదేవి ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సరస్వతీ అలంకరణలో అమ్మవారు

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని సరస్వతీదేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్య వైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పేదల తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందజేత

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కదిరాయచెర్వులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : పేదల ఇంటి తలుపు తట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీలోని చెరువుముందరపల్లె, కదిరాయచెర్వు, చిన్నగోగులవారిపల్లె, వడ్డిపల్లి, బాటవారిపల్లి, నడిమివడ్డిపల్లె, బొంతలవారిపల్లె గ్రామాలలో ఇంటింటిని ఎమ్మెల్యే సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేశారు. భూములు భాగ పరిష్కారం అయినా పట్టాదారు పాస్‌బుక్కులు మంజూరుకాలేదని 22 మంది, అర్హత ఉన్నా పింఛన్లు మంజూరు కాలేదని ఎనిమిదిమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బొంతలవారిపల్లెలో మురుగునీటి కాలువలు మంజూరు చేయాలని, వడ్డిపల్లెలో విద్యుత్ సౌకర్యం మెరుగుపరచాలని కోరారు. అలాగే చెరువుముందపల్లెలో నలుగురు, కదిరాయచెర్వులో ఆరుగురు, వడ్డిపల్లి ఇద్దరు, బొంతలవారిపల్లిలో ముగ్గురు పేదలు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, ఎంసీటీసీ సభ్యులు డాక్టర్ పురుషోత్తంనాయుడు, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్, సరళ, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టేందుకు చొరవ చూపాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

నిమ్మనపల్లె : బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు, గ్రామ, మండలస్థాయి కమిటీలు చొరవ చూపాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నివారణపై గ్రామస్థాయి కమిటీ సభ్యులకు ఐసీడీఎస్ సీడీపీఓ సుజాతతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బాల్యవివాహాల రహిత జిల్లాగా చేయడానికి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అందులో భాగంగా మండల గ్రామకమిటీలను ఎంపికచేసినట్లు తెలిపారు. మండలస్థాయిలోనూ, గ్రామస్థాయిలోనూ, బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ మండపాలు, ఆలయాల్లో మైనర్లకు వివాహాలు జరిపించేందుకు ప్రయత్నిస్తే వెంటనే సంబంధిత యాజమాన్యం సమాచారం తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ శివరామిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాను, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి కృషి చేయాలి

తంబళ్లపల్లె : గ్రామాల్లో పశుగణాభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ఉపాధి కల్పన పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగయ్య కోరారు. శుక్రవారం పశువైద్యశాలలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం పశువైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులు పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పీయం ఈజీపీ పథకం కింద 35శాతం సబ్సిడీతో రూ.5లక్షల వరకు రుణాలు ఇస్తారన్నారు. ఎన్‌ఎల్‌ఎం పథకం ద్వారా 50శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు, కోళ్ళు, పందుల పెంపకానికి వారు ఏర్పాటు చేసుకునే యూనిట్ విలువబట్టి రుణాలు ఇస్తారన్నారు. ఈ విషయాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్రదేవి, డాక్టర్లు సుజనశ్రీ, విక్రమ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న మైనార్టీ మహిళలు

బి.కొత్తకోట: పేద మైనార్టీ మహిళలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తన సొంత నిధులతో 150 మందికి కుట్టుమిషన్ల ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. వీటిని ఈనెల 17న బి.కొత్తకోటలో జరిగిన సభలో ఎంపీ మిథున్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. 60 మంది మహిళలకు శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు తమకు కుట్టుమిషన్లను ఉచితంగా అందించి ఉపాధికి అండగా నిలిచారని ఆనందరం వ్యక్తం చేస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కమిషనర్ పీఆర్.మనోహర్‌ను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ రమాదేవి, మాజీ ఉపసర్పంచు మాలిక్, వైఎస్సార్‌సీపీ నాయకులు సమీవుల్లా, శశిభూషణ్, సబ్జి, పవన్, హరి, శీన పాల్గొన్నారు.

ఆలయ భూములు కౌలుకు

నిమ్మనపల్లె : మండల పరిధిలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూములను కౌలుకు శనివారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. తవ పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

నేడు కల్యాణోత్సవం

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధి చక్కెరవాండ్లపల్లిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవానికి భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ కంచెంవారిపల్లెకు చెందిన బి. లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద దహన క్రియలకు గాను రూ. 10 వేలు ఆర్థిక సాయం మృతుని భార్య పరమేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెంగల్‌రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మరో రూ. లక్ష వారి వ్యక్తిగత ఖాతాకు జమ అవుతుందని తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించండి

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని ఫైనాన్స్, బ్యాంకు లింకేజీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ (డీపీఎం) లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయనతో పాటు చేయూత డీపీఎం రమణలు స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని సీసీలతో సమావేశమై సున్నా వడ్డీ, జగనన్న తోడు, ముద్ర లోన్ తదితర సంక్షేమ పథకాలపై చర్చించి పలు సూచనలిచ్చారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం


మదనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్షలో మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


పీలేరు రూరల్ : పేదలకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా మారిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో సీఎం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నూటిపాళెం పంచాయతీ, మున్సిపాలిటీలోని 11వవార్డులో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే నవాజ్‌బాషా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ మహబూబ్ చాంద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ, డాక్టర్.అనుపమ, వైస్ ఎంపీపీ డిష్‌రమణ, సర్పంచ్ మల్లికార్జున, జన్నేశేషాచలపతినాయుడు, దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

613 మందికి వైద్య సేవలు

పీలేరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 613 మందికి సేవలు అందించినట్లు ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. కావలిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పేదల ఆరోగ్యం కోసమే..

కలికిరి : పేదల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఏర్పాటు చేసిందని సర్పంచ్ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో మొత్తం 553 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 30 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, తహశీల్దారు భాగ్యలత, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదల రక్ష

బి.కొత్తకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు రక్ష అని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. శుక్రవారం నందిశెట్టివీధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సభలో ఆయన మాట్లాడుతూ వైద్యులను, ఔషధాలను ఇంటిముంగిటకే పంపి పేదలకు వైద్యం చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని అన్నారు.

చదువుతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ

పెద్దమండ్యం : ఉన్నత చదువులు చదివించడంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీడీపీవో నాగవేణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై పౌరోహితులు, మతపెద్దలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రజల్లో అధికారులు సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాల వయస్సు నిండే వరకు వివాహాలు చేయకూడదనే నిబంధనను ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. బాల్య వివాహాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో 2 రామక్రిష్ణ, డాక్టర్ హరివర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.